ప్రతి నీటి బొట్టు విలువైనదే
భవిష్యత్‌కు అది కీలకం

CNR
CVSR DIGITAL NEWS

ప్లాస్టిక్ రహిత సమాజం
కోసం ప్రయత్నిద్దాం

16 సెప్టెంబర్ 2026 | ప్రత్యేక సంచిక | cvsr.in

# డిజిటల్ దారిలో...
# సామాన్యుడి జేబుకే కొత్త భారం

- ఉచితం నుంచి రుసుము దిశగా కొత్త మలుపు
- రూ. 2వేల గీత వెనుక వినియోగదారుడి కొత్త లెక్క
- మర్చంట్ ఖర్చు చివరకు ఎవరి జేబులోకి చేరుతుంది
- జనధన్ నుంచి యూపీఐ వరకు మారిన ప్రయాణం
- నోట్ల ఖర్చుకు డిజిటల్ ఆదా ప్రత్యామ్నాయం కాదా?
- జీఎస్టీ రికార్డుల మధ్య మరో రెవెన్యూ మార్గం
- కాంగ్రెస్ ప్రశ్నల్లో వినిపిస్తున్న సామాన్యుడి ఆందోళన




నగదు వద్దన్నారు. డిజిటల్ వైపు నడవాలన్నారు. చేతిలో మొబైల్ ఉంటే చాలు.. జేబులో నోట్లు ఎందుకన్నారు. టీ కొట్టు నుంచి షాపింగ్ మాల్ వరకు క్యూఆర్ కోడ్‌ను చేర్చారు. స్కాన్ చేయడం దేశానికి అలవాటైంది. ప్రపంచం ముందు యూపీఐని డిజిటల్ ఇండియా విజయంగా నిలిపారు. ఇప్పుడు అదే వ్యవస్థలో రూ.2 వేలకుపైగా అర్హమైన మర్చంట్ పేమెంట్లకు 0.4 శాతం ఎండీఆర్ వచ్చేసింది. అక్టోబర్ 15 నుంచి అమలు కానున్న ఈ మార్పులో అసలు ప్రశ్న 4 రూపాయలా.. 40 రూపాయలా కాదు. ప్రజలకు ఉచితంగా అలవాటైన డిజిటల్ రహదారిపై రుసుము గేటు ఎందుకు తెరుచుకుందన్నదే!

**యూపీఐ ఉచితమంటే... ఎండీఆర్ బిల్లు ఎందుకు వచ్చింది?**

శాతం చిన్నదే అనుకోవచ్చు. కానీ తిరుగుతున్న డబ్బు చిన్నది కాదు. 2026 ఆగస్టులోనే యూపీఐ ద్వారా 24.51 బిలియన్ల ట్రాన్సాక్షన్లు జరిగాయి. వాటి విలువ రూ.29.82 లక్షల కోట్లు. ప్రపంచంలోనే అతిపెద్ద రిటైల్ ఫాస్ట్ పేమెంట్ వ్యవస్థగా ఎదిగిన యూపీఐ ఇప్పుడు భారతీయుడి రోజువారీ ఆర్థిక జీవితంలో భాగమైంది. ఇలాంటి మహాసముద్రంలో 0.4 శాతం అనే అంకెను చిన్న చుక్కగా చూడటం సాధ్యం కాదు. కొత్త ఎండీఆర్ ద్వారా పేమెంట్ ఇండస్ట్రీకి ఏటా రూ.5 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల వరకు కొత్త రెవెన్యూ రావచ్చన్న అంచనాలూ వెలువడ్డాయి. అంటే శాతం చిన్నదే.. మార్కెట్ మాత్రం మహాసముద్రం!

ప్రభుత్వ వివరణ సూటిగానే ఉంది. వ్యక్తుల మధ్య జరిగే పర్సన్ టు పర్సన్ ట్రాన్సాక్షన్లకు రుసుము లేదు. రూ.2 వేల వరకు మర్చంట్ పేమెంట్లకు ఎండీఆర్ లేదు. చిన్న వ్యాపారులకు మినహాయింపులు ఉన్నాయి. రూ.2 వేలకుపైగా అర్హమైన పర్సన్ టు మర్చంట్ పేమెంట్లలో 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారే భరించాలి.. వినియోగదారుడిపై నేరుగా మోపకూడదు. పేమెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, ఇన్నోవేషన్‌కు స్థిరమైన రెవెన్యూ అవసరమన్నది వ్యవస్థ వైపు నుంచి వినిపిస్తున్న వాదన. కానీ అక్కడితో ప్రజల ప్రశ్న ముగియదు.

**స్కాన్ అలవాటుకు ఇప్పుడు ధర కడతారా సర్కార్..**

కౌంటర్ దగ్గర వసూలు చేయకపోతే ఆ ఖర్చు కన్స్యూమర్‌కు చేరదని అర్థమా?

వ్యాపారం దాతృత్వం కాదు. మర్చంట్‌కు వచ్చే ప్రతి కొత్త ఆపరేటింగ్ కాస్ట్ అతడి లెక్కల్లో చేరుతుంది. అది నేరుగా 'యూపీఐ ఛార్జ్'గా బిల్లులో కనిపించకపోవచ్చు. ధరలో కలవచ్చు.. డిస్కౌంట్ తగ్గవచ్చు.. సర్వీస్ కాస్ట్ మారవచ్చు. ప్రపంచ పరిణామాలతో ముడిచమురు, రూపాయి, రవాణా, ముడిసరుకు ధరల్లో ఇప్పటికే హెచ్చుతగ్గులు వస్తున్న సమయంలో పేమెంట్ కాస్ట్ కూడా వ్యాపారి ఖర్చుల్లో చేరితే దాని పాస్‌త్రూ ఎక్కడ ఆగుతుందన్నదే అసలు ప్రశ్న. సెప్టెంబర్ 15న ముడిచమురు ధరల పెరుగుదల మధ్య రూపాయి నెలరోజుల కనిష్ఠానికి చేరడం కూడా వ్యాపార వ్యయాలపై ప్రపంచ పరిస్థితుల ప్రభావాన్ని గుర్తుచేస్తోంది.

ఇదే అంశాన్ని కాంగ్రెస్ రాజకీయ వేదికపైకి తీసుకొచ్చింది. వినియోగదారుడికి నేరుగా ఫీజు లేదని చెప్పినా, దుకాణదారుడిపై పడే రుసుము చివరకు ధరల్లో కలిసిపోయి కస్టమర్ జేబులో నుంచే వెళ్లదా అని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దీనిని 'డిజిటల్ పేమెంట్స్ టాక్స్'గా అభివర్ణించారు. డీఆర్ సాంకేతికంగా పన్ను కాదు, పేమెంట్ ప్రాసెసింగ్ రుసుము. అయినా కాంగ్రెస్ లేవనెత్తిన అంతిమ వినియోగదారుడి భారానికి సంబంధించిన ప్రశ్నను మాత్రం ఆ పేరుతోనే కొట్టిపారేయలేం.

ఇక్కడ రూ.2 వేల గీత కూడా కొత్త ప్రవర్తనకు దారితీయవచ్చు. ఒక కుటుంబం రూ.6 వేల వస్తువు కొంటే ఒకేసారి పేమెంట్ చేయడం బదులు రూ.2 వేల చొప్పున విడగొట్టే ప్రయత్నం చేయవచ్చు. మర్చంట్ కూడా ఖర్చు తప్పించుకునేందుకు అలాంటి మార్గాన్ని ప్రోత్సహించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఒకే మర్చంట్‌కు రోజులో ఒక్క ఉచిత ట్రాన్సాక్షన్ మాత్రమే అన్న నిబంధన లేదు. కానీ థ్రెషోల్డ్ ఆధారిత వ్యవస్థ సహజంగానే ట్రాన్సాక్షన్ స్ప్లిటింగ్‌కు ప్రోత్సాహం కల్పిస్తే, భవిష్యత్తులో దాన్ని అడ్డుకునేందుకు మరిన్ని నియమాలు అవసరమయ్యే పరిస్థితి ఏర్పడటం ఈ విధానంలోని మరో కీలక సవాలు.

**నేడు 0.4 % రేపెంత?**

అసలు రూ.2,001 చెల్లించడం నేటి భారత కుటుంబానికి 'పెద్ద లావాదేవీ'నా అన్నదీ చూడాలి. సూపర్ మార్కెట్ బిల్లు, దుస్తులు, మందులు, ఆస్పత్రి ఖర్చు, ఇంటి మరమ్మతు, రెస్టారెంట్, విద్యాసంబంధిత కొనుగోళ్లు.. రెండు వేల గీత దాటడం ఇప్పుడు అరుదైన విషయం కాదు. అదే సమయంలో రూ.75 వేలకుపైగా సాధారణ అర్హమైన మర్చంట్ ట్రాన్సాక్షన్‌కు ఎండీఆర్ గరిష్ఠంగా రూ.300 వద్ద ఆగుతుంది. రైల్వే, టెలికాం, ఇన్సూరెన్స్, ఇంధనం వంటి కొన్ని రంగాలకు రూ.5 ఫ్లాట్ ఎండీఆర్ ఉంది. అందుకే 'పెద్ద మొత్తం' అనే మాటకంటే రూ.2 వేల గీతను ఎందుకు ఎంచుకున్నారన్న పాలసీ లెక్క ప్రజలకు స్పష్టంగా తెలియడం అవసరం.

**% చిన్నదే మార్కెట్ మాత్రం.. మహాసముద్రం కాదా!**

ఇదంతా ఒక్కరోజులో వచ్చిన మార్పు కాదు. ఒకప్పుడు దేశాన్ని లెస్ క్యాష్ ఎకానమీ వైపు తీసుకెళ్లేందుకు ప్రభుత్వమే యూపీఐకి ఆర్థిక ఊతమిచ్చింది. 2021-22లో రూ.1,389 కోట్లు, 2022-23లో రూ.2,210 కోట్లు, 2023-24లో రూ.3,631 కోట్లు డిజిటల్ ట్రాన్సాక్షన్ ప్రోత్సాహకాలుగా ప్రభుత్వం కేటాయించింది. 2024-25లో మరో రూ.1,046 కోట్లు పంపిణీ అయ్యాయి. మొత్తం పథకానికి రూ.8,276 కోట్ల బడ్జెటరీ సపోర్ట్ నమోదైంది. అప్పటి లక్ష్యం స్పష్టం.. చిన్న వ్యాపారికి ఖర్చు లేకుండా డిజిటల్ పేమెంట్స్ విస్తరించడం. ఆ ప్రయాణమే ఇప్పుడు సెల్ఫ్ సస్టైనబుల్ మోడల్ వైపు మళ్లుతోంది.

నాడు జీరో ఎండీఆర్ ఒక పాలసీ. నేడు పరిమిత ఎండీఆర్ మరో పాలసీ. ఈ రెండింటి మధ్య నిలబడింది మాత్రం అదే వినియోగదారుడు. 2025లోనే కేంద్రం యూపీఐపై ఎండీఆర్ లేదని, అందువల్ల దానిపై జీఎస్టీ కూడా వర్తించదని అధికారికంగా ప్రకటించింది. అప్పటికే యూపీఐ ట్రాన్సాక్షన్ విలువ 2019-20లోని రూ.21.3 లక్షల కోట్ల నుంచి 2025 మార్చి నాటికి రూ.260.56 లక్షల కోట్లకు పెరిగిందని ప్రభుత్వం తెలిపింది. అంటే ప్రజల నమ్మకం, వ్యాపారుల స్వీకరణ, ప్రభుత్వ ప్రోత్సాహం కలిసి నిర్మించిన భారీ ఎకోసిస్టమ్ ఇది. ఇప్పుడు అదే ఎకోసిస్టమ్‌లో కొత్త రెవెన్యూ మోడల్ మొదలవుతుండటమే అసలు పాలసీ మలుపు.

**ప్రజల డిజిటల్ విజయానికి బిల్లు ఎవరు కడతారు?**

జనధన్ ప్రయాణం కూడా మరో పాఠం చెబుతోంది. 2026 ఆగస్టు 12 నాటికి దేశంలో 59.04 కోట్ల జనధన్ ఖాతాలుండగా, వాటిలో 15.37 కోట్లు ఇన్‌ఆపరేటివ్‌గా ఉన్నాయని

2లో

# డిజిటల్ దారిలో సామాన్యుడి జేబుకే కొత్త భారం

(మొదటి పేజీ తరువాయి) ఆర్బీఐ ద్వారా లభించిన ఆర్థిక మంత్రిత్వ శాఖ సమాచారం వెల్లడించింది. 5.72 కోట్ల ఖాతాల్లో జీరో బ్యాలెన్స్ ఉంది. జనధన్ ఆర్థిక సమ్మిళితానికి చేసిన భారీ ప్రయత్నాన్ని ఈ సంఖ్యలు చిన్నబుచ్చవు. కానీ ఖాతా తెరవడం ఒక దశైతే దాన్ని ప్రజలు నిరంతరం ఉపయోగించేలా చేయడం మరో దశ. అదే పాఠం యూపీఐకూ వర్తిస్తుంది. సంఖ్యల విజయంతోపాటు వ్యవస్థ ప్రజలకు దీర్ఘకాలం ఎంత చౌకగా, సులభంగా అందుబాటులో ఉంటుందన్నదే అసలు పరీక్ష.

డిజిటల్‌పేమెంట్స్‌పెరిగితేనోట్లఅవసరం వెంటనే మాయమవుతుందనుకోవడం కూడా వాస్తవం కాదు. 2024-25లో బ్యాంకు నోట్ల విలువ, పరిమాణం రెండూ పెరిగాయి. అదే ఏడాది నోట్ల సెక్యూరిటీ ప్రింటింగ్‌కు ఆర్బీఐ రూ.6,372.8 కోట్లు ఖర్చు చేసింది. అంతకుముందు ఏడాది అది రూ.5,101.4 కోట్లు. అంటే ప్రస్తుతం క్యాష్, డిజిటల్ రెండింటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఖర్చూ దేశం భరిస్తోంది. అయితే ప్రభుత్వ అధ్యయనమే తక్కువ విలువ నోట్ల వాటా, ఏటీఎం విత్‌డ్రాయల్స్ తగ్గడాన్ని డిజిటల్ పేమెంట్స్ పెరుగుదలతో అనుసంధానించింది. భవిష్యత్తులో క్యాష్ మేనేజ్‌మెంట్‌లో

లభించే ఎఫిషియెన్సీ డివిడెండ్‌ను డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు మళ్లించే ఆలోచనకు ఇదే నేపథ్యం.

నోటు ముద్రించడానికి ఖర్చుంది. దాన్ని దేశమంతా తరలించడానికి ఖర్చుంది. కరెన్సీ చెస్ట్‌ల నిర్వహణ, పాడైన నోట్ల తొలగింపు, కొత్త నోట్ల సరఫరా, భద్రత.. అన్నీ మానిటరీ వ్యవస్థ ఖర్చులే. వాటికి ప్రతి సారి నోటు చేతులు మారినప్పుడు ప్రత్యేక బిల్లు పెట్టరు. యూపీఐలో ప్రతి ట్రాన్సాక్షన్‌కు ప్రాసెసింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్యాంకింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఖర్చులు ఉంటాయన్నది కూడా నిజమే. కానీ దేశం గర్వంగా చెప్పుకునే డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్వహణను బడ్జెటరీ సపోర్ట్‌తో కొనసాగించాలా, మర్చంట్ రెవెన్యూ మోడల్‌కు మళ్లించాలా అన్నది కేవలం టెక్నాలజీ ప్రశ్న కాదు.. ప్రజా విధాన ఎంపిక.

జీఎస్టీ దగ్గరకు వస్తే మరో చిత్రం కనిపిస్తుంది. 2026 ఆగస్టులో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.1,99,853 కోట్లకు చేరాయి. ఏడాది క్రితం రూ.1,74,116 కోట్లతో పోలిస్తే 14.8 శాతం పెరుగుదల నమోదైంది. రీఫండ్ల తర్వాత నికర వసూళ్లు రూ.1,68,057 కోట్లు. జీఎస్టీ ప్రభుత్వానికి చట్టబద్ధమైన పన్ను ఆదాయం. ఎండీఆర్ మాత్రం పేమెంట్ ఎకోసిస్టమ్‌కు వెళ్లే రుసుము. రెండూ ఒకటి కావు. అయినా నెలకు దాదాపు రెండు లక్షల కోట్ల జీఎస్టీ వసూలవుతున్న ఆర్థిక వ్యవస్థలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను జీరో ఎండీఆర్‌తో కొనసాగించేందుకు అవసరమైన బడ్జెట్ సపోర్ట్ ఒక పాలసీ ప్రత్యామ్నాయంగా ఎందుకు కొనసాగకూడదన్న ప్రశ్నకు ప్రాధాన్యం ఉంది.

సంక్షేమానికి ప్రభుత్వం లక్షల కోట్లు ఖర్చు చేయడాన్ని తప్పుబట్టాల్సిన అవసరం లేదు. సంక్షేమం ప్రభుత్వ బాధ్యతల్లో భాగమే. అదే సమయంలో కోట్ల మంది రోజూ ఉపయోగించే యూపీఐ కూడా దేశ ఆర్థిక మౌలిక వసతుల్లో భాగమైపోయింది. గతంలో దాని విస్తరణ కోసం వేల కోట్ల ప్రోత్సాహకాన్ని ప్రభుత్వమే భరించింది. ఆ మోడల్ వల్లే బ్యాంకులు, పేమెంట్ సిస్టమ్ ఆపరేటర్లు, యాప్ ప్రొవైడర్లకు ఊతం లభించిందని ప్రభుత్వ అధ్యయనం పేర్కొంది. అలాంటప్పుడు ప్రజలకు జీరో ఎండీఆర్ కొనసాగించేందుకు అవసరమైన ఖర్చును పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యయంగా చూడటం కూడా ప్రభుత్వం ముందున్న ఒక స్పష్టమైన ప్రత్యామ్నాయమే.

మరోవైపు జీఎస్టీ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా రావాల్సిన పన్ను ఆదాయాన్ని



మరింత సమర్థంగా అమలు చేయడం, ఎగవేతను అరికట్టడం, కంప్లయన్స్‌ను పెంచడం ప్రభుత్వానికి నిరంతర బాధ్యత. రికార్డు వసూళ్లు నమోదవుతున్నాయంటే పన్ను వ్యవస్థ విస్తరించినట్లు తెలుస్తోంది. అంతమాత్రాన ఎగవేత పూర్తిగా అంతరించిందని అర్థం కాదు. కొత్త రెవెన్యూ మార్గాలను తెరవడం ఒక పాలసీ ఎంపికైతే, ఇప్పటికే ఉన్న పన్ను వ్యవస్థలో లీకేజీలను మరింత కట్టడి చేయడం మరో ఎంపిక. ప్రజలపై పరోక్ష ఖర్చు పడే అవకాశం ఉన్న ప్రతి కొత్త విధానాన్ని ఈ రెండు ప్రత్యామ్నాయాల మధ్యే తూకం వేయాల్సి ఉంటుంది.

ఇక్కడ మరో భయం రేటు కంటే దాని భవిష్యత్తు. నేడు 0.4 శాతం. రూ.2 వేల వరకు మినహాయింపు. కానీ ఈ రేటు శాశ్వతమని, ఈ గీత ఎప్పటికీ మారదని ప్రస్తుత వ్యవస్థ ఎలాంటి శాశ్వత హామీ ఇవ్వదు. గతంలో యూపీఐ మర్చంట్ రుసుముల నిర్మాణం మారింది. తర్వాత జీరో ఎండీఆర్ వచ్చింది. ఇప్పుడు మళ్లీ పరిమిత ఎండీఆర్ వచ్చింది. అందుకే 'నేడు 0.4 శాతం.. రేపెంత?' అన్నది రాజకీయ నినాదం మాత్రమే కాదు. ఒకసారి పర్సంటేజ్ ఆధారిత ప్రైసింగ్ మోడల్‌లోకి ప్రవేశించిన తర్వాత భవిష్యత్తులో రేటు, థ్రెషోల్డ్ మార్పులకు ఎంత స్పష్టమైన రక్షణ ఉందన్నది వినియోగదారుడి ప్రయోజనానికి సంబంధించిన ప్రశ్న.

ఇక్కడే ప్రభుత్వానికి మరో బాధ్యత ఉంటుంది. మర్చంట్ ఎండీఆర్‌ను నేరుగా వినియోగదారుడిపై మోపకూడదని చెప్పడం ఒక్కటే సరిపోదు. రూ.10 వేల బిల్లుపై వచ్చిన అదనపు ఆపరేటింగ్ కాస్ట్ రేపటి ధరలో కలిసిందా? డిస్కౌంట్ తగ్గిందా? సర్వీస్ ధర పెరిగిందా? వీటిని విడదీసి గుర్తించడం సామాన్యుడికి సాధ్యం కాదు. జీఎస్టీ తగ్గించినప్పుడు ప్రయోజనం వినియోగదారుడికి చేరాలని ప్రభుత్వం ఆశించినట్లే, కొత్త మర్చంట్ కాస్ట్ పరోక్షంగా కన్జ్యూమర్‌కు పాస్‌త్రూ కాకుండా ఉండేందుకు పర్యవేక్షణ ఎంత బలంగా ఉంటుందన్నదే ఇప్పుడు కీలకం. లేకపోతే 'కస్టమర్‌కు ఛార్జ్ లేదు' అన్న వాక్యం కాగితంపై నిజమై, మార్కెట్‌లో ధర మరో కథ చెప్పే ప్రమాదం ఉంటుంది.

రిక్షా కార్మికుడి నుంచి వీధి వ్యాపారి వరకు, కూరగాయల బండి నుంచి పెద్ద షాపింగ్ మాల్ వరకు క్యూఆర్ కోడ్ చేరింది. కొన్ని చోట్ల నగదు కంటే స్కాన్ చేయడమే సులభమైంది. ప్రజలే తమ అలవాట్లు మార్చుకుని ఈ వ్యవస్థను విజయవంతం చేశారు. యూపీఐకి టెక్నాలజీని సంస్థలు ఇచ్చి ఉండొచ్చు.. పాలసీని ప్రభుత్వం ఇచ్చి ఉండొచ్చు.. కానీ దానికి జీవం పోసింది కోట్ల మంది వినియోగదారులే. అందుకే వారి అలవాటు ఒక భారీ రెవెన్యూ మార్కెట్‌గా మారే ప్రతి అడుగునూ ప్రశ్నించడం అవసరం. సాంకేతికత ప్రజల జీవితాన్ని సులభం చేయాలి.. ప్రజల అలవాటే సాంకేతిక వ్యవస్థకు అంతులేని ఆదాయ వనరుగా మారకూడదు.

రాజకీయంగా కాంగ్రెస్‌కు ఇది అవకాశం. అధికార పక్షానికి తన విధానాన్ని సమర్థించుకునే అవకాశం. బ్యాంకులకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కాస్ట్ ఉంది. పేమెంట్ కంపెనీలకు రెవెన్యూ కావాలి. వ్యాపారికి మార్జిన్ కావాలి. ప్రభుత్వానికి వ్యవస్థ సెల్ఫ్ సస్టైనబుల్ కావాలి. ఈ మొత్తం గొలుసు చివరన నిలబడిన వినియోగదారుడికి మాత్రం తన సంపాదనలో ప్రతి రూపాయి విలువైనదే. అందరి లెక్కల్లో ఆదాయం కనిపిస్తుంటే.. సామాన్యుడి లెక్కలో మాత్రం ఖర్చు ఎందుకు పెరగాలి? ఇదే రాజకీయాలకు అతీతంగా నిలిచే అసలు ప్రశ్న.

అందుకే ఈ వివాదాన్ని 0.4 శాతం దగ్గర ముగించలేం. నిన్న క్యాష్ తగ్గించమన్నారు. తర్వాత డిజిటల్ ఇండియా అన్నారు. జీరో ఎండీఆర్‌తో స్కాన్ చేయడం అలవాటు చేశారు. ప్రపంచానికి యూపీఐ విజయగాథ చెప్పారు. ఇప్పుడు అదే విజయానికి సెల్ఫ్ సస్టైనబిలిటీ పేరుతో కొత్త ధరల వ్యవస్థ మొదలవుతోంది. పేరు ఎండీఆర్ కావచ్చు.. పేమెంట్ కాస్ట్ కావచ్చు.. రెవెన్యూ మోడల్ కావచ్చు. సామాన్యుడికి మాత్రం పేరు ముఖ్యం కాదు.. తన జేబు నుంచి అదనంగా ఎంత వెళుతుందన్నదే ముఖ్యం. అందుకే చివరి ప్రశ్న ఒక్కటే.. డిజిటల్ ఇండియా విజయానికి బిల్లు చివరకు ఎవరు కడతారు

?



నేత్రదానం అంటే మన తర్వాత కూడా వెలుగును పంచడం. మన కళ్లతో మరో వ్యక్తి ప్రపంచాన్ని చూడగలిగితే, అంతకంటే గొప్ప దానం మరొకటి ఉండదు. జీవితాంతం చీకటిలో ఉన్నవారికి చూపు అందించే మహత్తర అవకాశం నేత్రదానం. మనం వెళ్లిపోయినా... మన చూపు మాత్రం ఇంకొకరి జీవితంలో వెలుగుగా నిలవాలి.







© 2026 CVSR Digital News | cvsr.in | Privacy Policy | Terms & Conditions